BALAGAM TV
BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com
హైదరాబాద్ శుక్రవారం 23 జనవరి 2026 | www.balagamtv.com | పేజీలు 4

## మేడారం జాతరకు రూ.165 కోట్లతో రహదారుల నిర్మాణం

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

మేడారం జాతర నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం రహదారుల నిర్మాణానికి రూ.165 కోట్లను కేటాయించింది. జాతరకు భారీ ఎత్తున భక్తులు తరలి వస్తుండటంతో 1418 ఎకరాల విస్తీర్ణంలో పార్కింగ్ స్థలాన్ని కేటాయించింది. అక్కడ సకల సదుపాయాలను ఏర్పాటు చేసింది. మేడారానికి వచ్చే ప్రధాన రహదారులు, జాతీయ రహదారులు, రోడ్లు, భవనాల శాఖ నిర్వహణలో ఉండే రహదారులతోపాటు పంచాయతీరాజ్ శాఖ ద్వారా నిర్వహించే రహదారులన్నింటిని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసింది. వివిధ శాఖల కింద మేడారానికి దారితీసే 39 ప్రధాన రహదారులు ఉన్నాయి. మరో 10 రోడ్లను, మూడు కల్వర్టులను కొత్తగా నిర్మించారు. జాతీయ రహదారులకు చెందిన ఎనిమిది రహదారులను పటిష్ట పరిచారు. మరమ్మత్తు, నూతన బ్రిడ్జిల నిర్మాణాన్ని రూ. 3.60 లక్షలతో చేపట్టి పూర్తి చేశారు. కటాక్షపూర్, మల్లంపల్లి వద్ద నూతన బ్రిడ్జిల నిర్మాణం పూర్తి చేశారు. రోడ్లు, భవనాల శాఖ ద్వారా దాదాపు రూ.102 కోట్ల వ్యయంతో రహదారుల నిర్మాణం చేపట్టారు. పస్రా నుంచి భూపాలపల్లి వరకు 33 కిలోమీటర్లు, తాడ్వాయి నుంచి నార్లాపూర్ వరకు 20 కిలోమీటర్లు, చిన్నబోయినపల్లి నుంచి ఊరట్టం వరకు 23 కి.మీ. రహదారుల పటిష్టత, రీకార్పెటింగ్ చేపట్టారు. చిలకల గట్టు సమ్మక్క మార్గం నుంచి గద్దెల వరకు, సమ్మక్క టెంపుల్ వద్ద, పోలీస్ క్యాంపుల వద్ద బారికేడింగ్ ఏర్పాట్లు చేశారు. పోలీస్ క్యాంపు వద్ద హెలిపాడ్స్ నిర్మాణం, మరమత్తులు చేపట్టడం జరిగింది.

# లోయలో పడిన ఆర్మీ వాహనం

- 10 మంది సైనికులు మృతి, ఆరుగురికి గాయాలు
- జమ్మూకశ్మీర్‌లో ఘోర ప్రమాదం



**బలగం టీవీ, శ్రీనగర్/దోడా**

జమ్మూకశ్మీర్‌లోని దోడా జిల్లాలో గురువారం ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. భదర్వ--చంబా అంతరాష్ట్ర రహదారిలోని ఖన్నీ టాప్ వద్ద ఆర్మీకి చెందిన బుల్లెట్‌ప్రూఫ్ వాహనం అదుపు తప్పి సుమారు 200 అడుగుల లోతు ఉన్న లోయలో పడటంతో 10 మంది సైనికులు ప్రాణాలు కోల్పోయారు. మరో ఆరుగురు సైనికులు తీవ్రంగా గాయపడ్డారు.ప్రమాద సమయంలో వాహనంలో మొత్తం 17 మంది సైనికులు ఉన్నట్లు అధికారులు తెలిపారు. సమాచారం అందుకున్న వెంటనే ఆర్మీ సిబ్బంది, పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన సైనికులను సమీప ఆస్పత్రులకు తరలించగా, పలువురి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం ఉధంపూర్ మిలిటరీ ఆస్పత్రికి తరలించినట్లు అధికారులు వెల్లడించారు.డ్రైవర్ వాహనంపై నియంత్రణ కోల్పోవడమే ప్రమాదానికి కారణమని ప్రాథమికంగా భావిస్తున్నారు. అలాగే, ఆ ప్రాంతంలో భారీగా మంచు కురుస్తుండటంతో రహదారి పరిస్థితులను అంచనా వేయలేకపోవడం వల్లే ఈ ప్రమాదం జరిగి ఉండొచ్చని అధికారులు పేర్కొన్నారు.

**లెఫ్టినెంట్ గవర్నర్, సీఎం సంతాపం**

ఈ ప్రమాదంపై జమ్మూకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా, ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. మృత సైనికుల కుటుంబాలకు సానుభూతి తెలుపుతూ, గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని సీఎం ఆకాంక్షించారు."దోడా జిల్లాలో జరిగిన ప్రమాదంలో 10 మంది సైనికులు వీరమరణం పొందడం అత్యంత విషాదకరం. దేశానికి వారు చేసిన సేవలు, త్యాగాలను ఎల్లప్పుడూ గుర్తుంచుకుంటాం. మృతుల కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి. గాయపడిన సైనికులను ఎయిర్?లిఫ్ట్ చేసి ఆస్పత్రికి తరలించాం. వారికి అత్యుత్తమ చికిత్స అందించాలని అధికారులను ఆదేశించాను," అని లెఫ్టినెంట్ గవర్నర్ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది.

**కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ సానుభూతి**

ఆర్మీ వాహన ప్రమాదంపై కేంద్ర మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ కూడా స్పందించారు. "దోడా జిల్లా అధికారులతో మాట్లాడాను. ఖన్నీ టాప్ వద్ద జరిగిన ఈ ప్రమాదంలో 10 మంది సైనికులు ప్రాణాలు కోల్పోవడం బాధాకరం. గాయపడిన వారిని ఉధంపూర్ కమాండ్ హాస్పిటల్‌కు తరలించారు. ఆస్పత్రి ఇన్‌చార్జ్ మేజర్ జనరల్ డాక్టర్ సంజయ్ శర్మతో మాట్లాడాను. క్షతగాత్రులకు మెరుగైన చికిత్స అందుతోంది. వీర జవాన్ల త్యాగాన్ని మాటల్లో వర్ణించలేం. వారి కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి," అని ఆయన పేర్కొన్నారు.

# దావోస్ పర్యటన విజయవంతం

- జ్యూరిచ్‌కు బయల్దేరిన సీఎం రేవంత్‌రెడ్డి
- రాష్ట్రానికి తిరిగొచ్చిన మంత్రులు, అధికారుల బృందం
- రూ.623 కోట్ల పెట్టుబడులు ప్రకటించిన ష్నైడర్ ఎలక్ట్రిక్






**బలగం టీవీ, దావోస్**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని 'తెలంగాణ రైజింగ్' ప్రతినిధి బృందం దావోస్ పర్యటన విజయవంతంగా ముగిసింది. మూడు రోజుల పాటు జరిగిన వరల్డ్ ఎకనమిక్ ఫోరం--2026 (WEF-2026) సదస్సులో 'తెలంగాణ రైజింగ్--2047' లక్ష్యాలు, రాష్ట్ర దార్శనికతను అంతర్జాతీయ వేదికపై ప్రతినిధి బృందం సమర్థంగా చాటిచెప్పింది. హైదరాబాద్‌లో ఇటీవల నిర్వహించిన తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌లో రూ.5.75 లక్షల కోట్ల పెట్టుబడులను రాష్ట్ర ప్రభుత్వం ఆకర్షించిన నేపథ్యంలో, దావోస్ సదస్సులో పెట్టుబడులకు మించి రాష్ట్ర భవిష్యత్ అభివృద్ధి ప్రణాళికలు, సమగ్ర అభివృద్ధి లక్ష్యాలను ప్రపంచానికి తెలియజేయాలన్న ప్రభుత్వ సంకల్పం ఫలించింది.

మూడు రోజుల పర్యటనలో గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు, డేటా సెంటర్లు, క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ, తయారీ రంగాల్లో పెట్టుబడులను తెలంగాణ ఆకర్షించింది. అలాగే ఏఐ, సస్టైనబిలిటీ, స్కిల్లింగ్ కార్యక్రమాలకు సంబంధించిన పలు అవగాహన ఒప్పందాలు కుదిరాయి.ఈ పర్యటనలో ముఖ్యమంత్రి వరల్డ్ ఎకనమిక్ ఫోరం నిర్వహించిన రెండు కీలక సెషన్లలో పాల్గొన్నారు. దావోస్--2026 సదస్సు అనంతరం జూలై--ఆగస్టు నెలల్లో హైదరాబాద్?లో ఫాలోఅప్ సమావేశం నిర్వహించాలని ముఖ్యమంత్రి చేసిన ప్రతిపాదనకు సానుకూల స్పందన లభించింది. ప్రపంచ స్థాయి ప్రముఖ సంస్థలు, పారిశ్రామిక దిగ్గజాలతో ముఖ్యమంత్రి మొత్తం 12 ముఖాముఖి సమావేశాలు నిర్వహించారు. పలు ప్రత్యేక సెషన్లు, కీలక సమావేశాల అనంతరం తెలంగాణ ప్రతినిధి బృందం దావోస్ పర్యటన గురువారం సాయంత్రంతో ముగిసింది.

**జ్యూరిచ్‌కు బయల్దేరిన సీఎం రేవంత్‌రెడ్డి**

పర్యటన ముగించుకుని ముఖ్యమంత్రి జూరిచ్‌కు బయల్దేరగా, అక్కడి నుంచి అమెరికా పర్యటనకు వెళ్లనున్నారు. మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస రెడ్డి దావోస్ నుంచి భారత్‌కు తిరుగు ప్రయాణమయ్యారు.

ఇదిలా ఉండగా, ప్రఖ్యాత ష్నైడర్ ఎలక్ట్రిక్ ఇండియా సంస్థ తెలంగాణలో తన కార్యకలాపాలను విస్తరించనున్నట్లు ప్రకటించింది. దావోస్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రతినిధి బృందంతో, సంస్థ సీఈఓ దీపక్ శర్మతో జరిగిన చర్చల అనంతరం రూ.623 కోట్ల పెట్టుబడులతో విస్తరణ కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వెల్లడించింది. విద్యుత్ రంగంలో ఇంధన మార్పిడి, విద్యుత్ నిల్వ ప్రాజెక్టులు, గ్రిడ్ ఆధునీకరణ, విద్యుత్ సామర్థ్య వృద్ధి, ఇండస్ట్రియల్ పార్కులు, పట్టణ మౌలిక వసతుల కోసం డిజిటల్ విద్యుత్ నిర్వహణ వంటి అంశాలపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు. ష్నైడర్ ఎలక్ట్రిక్ ఇండియా గాగిల్లాపూర్, శంషాబాద్‌లోని యూనిట్ల విస్తరణకు ఈ పెట్టుబడులు వినియోగించనుంది. దీని ద్వారా ఎయిర్ సర్క్యూట్ బ్రేకర్లు, మోల్డెడ్ కేస్ సర్క్యూట్ బ్రేకర్లు, కాంటాక్టర్లు, పుష్ బటన్లు వంటి కీలక ఎలక్ట్రికల్ భద్రతా ఉత్పత్తుల తయారీ సామర్థ్యం పెరగనుంది.

ఈ సందర్భంగా పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కృషిని ముఖ్యమంత్రి అభినందించారు. 2047 నాటికి నెట్-జీరో అభివృద్ధి లక్ష్యాల సాధనలో సుస్థిరత కీలకమని పేర్కొన్నారు. ష్నైడర్ ఎలక్ట్రిక్ ఇండియా సీఈఓ దీపక్ శర్మ మాట్లాడుతూ, తెలంగాణలో నైపుణ్యాభివృద్ధి కోసం సంస్థ 38 శిక్షణ కేంద్రాలను నిర్వహిస్తోందని, ముఖ్యంగా ఇంధన నిర్వహణ, పారిశ్రామిక ఆటోమేషన్, డిజిటల్ ట్రాన్స్?ఫర్మేషన్ రంగాల్లో సేవలు అందిస్తున్నట్లు తెలిపారు.

## హైదరాబాద్‌లో రూ. 5 వేల కోట్లతో భారీ ఏఐ డేటా సెంటర్

- హైదరాబాద్‌ను దేశంలోనే ఏఐ డేటా సెంటర్ హబ్గా తీర్చిదిద్దే దిశగా మరో పెద్ద అడుగు
- యూపీసీ రిన్యూవబుల్స్ -- వోల్ట్ డేటా సెంటర్స్‌తో తెలంగాణ ప్రభుత్వం ఎంఓయూ
- ఫ్యూచర్ సిటీలో 100 మెగా వాట్ల ఏఐ డేటా సెంటర్ ఏర్పాటు

వివరాలు 2వ పేజీలో

# సారండా అడవుల్లో భారీ ఎన్‌కౌంటర్

- 15 మంది మావోయిస్టులు హతం
- రూ.5 కోట్ల రివార్డు ఉన్న సెంట్రల్ కమిటీ సభ్యుడు మృతి



**బలగం టీవీ, రాంచీ**

ఝార్ఖండ్‌లోని సారండా అటవీ ప్రాంతంలో భద్రతా బలగాలు-మావోయిస్టుల మధ్య గురువారం భారీ ఎన్‌కౌంటర్ చోటుచేసుకుంది. ఈ ఎదురుకాల్పుల్లో 15 మంది మావోయిస్టులు హతమయ్యారని పోలీసులు తెలిపారు. మృతుల్లో మావోయిస్టు సెంట్రల్ కమిటీ సభ్యుడు పతిరామ్ మాంఝీ కూడా ఉన్నట్లు వెల్లడించారు. అతనిపై రూ.5 కోట్ల రివార్డు ఉంది.

చైబాసాలోని కిరీబురు పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న సారండా అటవీ ప్రాంతంలో సీఆర్?పీఎఫ్, ఇతర భద్రతా దళాలు కలిసి మావోయిస్టు వ్యతిరేక ఆపరేషన్ చేపట్టాయి. కూంబింగ్ ఆపరేషన్ నిర్వహిస్తున్న సమయంలో మావోయిస్టులు ఎదురుపడటంతో కాల్పులు మొదలయ్యాయి. మావోలు మొదట కాల్పులు జరపగా, వెంటనే భద్రతా బలగాలు ప్రతిస్పందించడంతో భీకర ఎదురుకాల్పులు చోటుచేసుకున్నాయి.ఈ ఘటనలో మావోయిస్టులకు భారీ నష్టం వాటిల్లినట్లు పోలీసులు తెలిపారు. ఎన్‌కౌంటర్‌లో ఓ సీనియర్ మావోయిస్టు కమాండర్ కూడా హతమైనట్లు సమాచారం. అతనిపై రూ.50 లక్షల రివార్డు ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు. దట్టమైన అడవుల్లో ఇంకా మావోయిస్టులు దాక్కుని ఉండటంతో కాల్పులు కొనసాగుతున్నాయని తెలిపారు. ఆపరేషన్ పూర్తైన తర్వాత పూర్తి వివరాలు వెల్లడిస్తామని చెప్పారు.గురువారం ఉదయం నుంచే కాల్పులు జరుగుతున్నాయని కొల్హాన్ డీఐజీ అనురంజన్ తెలిపారు. మావోయిస్టులను పూర్తిగా ఏరివేయడానికి అదనపు బలగాలను కూడా మోహరించినట్లు పేర్కొన్నారు.

# సింగరేణిపై కొనసాగుతున్న ఆర్థిక విధ్వంసం



- తెలంగాణలో అడుగుపెట్టేందుకు అనుమతిస్తే సీబీఐ విచారణ
- కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే కాకుండా రెండేండ్ల కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో కూడా సింగరేణిపై ఆర్థిక విధ్వంసం కొనసాగుతోందని కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణలో సీబీఐ అడుగు పెట్టేందుకు వీలులేదంటూ అసెంబ్లీ తీర్మానం చేసిందని తెలిపారు. ఇప్పటికైనా నైని కోల్‌బ్లాక్ విషయంలో అనుమతిస్తే తెలంగాణ రాష్ట్రంలో సీబీఐ అడుగు పెడుతుందన్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్న సమయంలో సింగరేణి బోర్డును నిర్వీర్యం చేసి, ఆ తర్వాత కల్వకుంట్ల కుటుంబం పెత్తనం చేసిందని విమర్శించారు. సింగరేణి బొగ్గుబావులను బీఆర్ఎస్ సర్కారు 12 ప్రయివేట్ కంపెనీలకు అప్పగించిం దన్నారు. గురువారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలోనూ, ఎన్డీయే ప్రభుత్వ హయాంలోనూ సింగరేణి విషయంలో కేంద్రం జోక్యం చేసుకోలేదని స్పష్టం చేశారు. అయినప్పటికీ సింగరేణి రాష్ట్ర అభివృద్ధిలో కీలక పాత్ర పోషించిందని తెలిపారు. లాభాల్లో ఉన్న సింగరేణి రాష్ట్రం ఏర్పడిన తర్వాత క్రమంగా సమస్యల్లో చిక్కుకుందని చెప్పారు. ఈ సంస్థలో తెలంగాణ రాష్ట్రానికి 51 శాతం, కేంద్రానికి 49 శాతం వాటా ఉన్నప్పటికీ ఎన్నో ఏండ్లుగా రాష్ట్ర ప్రభుత్వ ఆధీనంలోనే ఉందనీ, ఎలాంటి ప్రత్యక్ష జోక్యం ఉండదని చెప్పారు. సింగరేణి బోర్డులో కేంద్ర నుంచి ముగ్గురు డైరెక్టర్లు, రాష్ట్రం నుంచి ఏడుగురు ఉంటారు. గతంలో కాంగ్రెస్ హయాంలో ఏర్పడిన వర్కింగ్ సిస్టమ్ ప్రకారం, రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఏడుగురు, కేంద్రం నుంచి ఇద్దరు, వెస్టర్న్ కోల్ ఫీల్డ్ నుంచి ఒకరు కలిపి మొత్తం 10 మంది డైరెక్టర్లతో సింగరేణి బోర్డు పని చేస్తుంది' అని అన్నారు. అన్ని నిర్ణయాలను బోర్డు పరిధిలోనే తీసుకుంటారని గుర్తు చేశారు. అందుకు సంబంధించిన ప్రతి సమాచారం కేంద్రానికి ఉండదని గుర్తు చేశారు. సింగరేణిని కాపాడేందుకు కేంద్ర ప్రభుత్వం కమిటీ ఏర్పాటు చేసి, ఖర్చు తగ్గింపుపై నివేదిక సిద్ధం చేయించిందన్నారు. బీఆర్ఎస్ పాలనలో మిగితా 2వ పేజీలో

# ఫోన్ ట్యాపింగ్ కేసులో కేటీఆర్‌కు సిట్ నోటీసులు

- నేడు ఉదయం 11గంటలకు విచారణకు రావాలని నోటీసులు
- జూబ్లీహిల్స్ పీఎస్‌లో విచారించనున్న సిట్ అధికారులు

**బలగం టీవీ, హైదరాబాద్**




తెలంగాణలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసు కీలక మలుపు తిరిగింది. ఈ వ్యవహారంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌కు ప్రత్యేక విచారణ బృందం నోటీసులు జారీ చేసింది. ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణలో భాగంగా ఇప్పటికే పలువురు ఉన్నతాధికారులను విచారించిన సిట్, ఇప్పుడు రాజకీయ నేతలపై దృష్టి సారించింది. శుక్రవారం ఉదయం 11 గంటలకు కేటీఆర్‌ని జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో విచారణకు హాజరుకావాలని నోటీసుల్లో పేర్కొన్నారు బీఎన్ఎస్ సెక్షన్ 160 కింద కేటీఆర్‌కు నోటీసులు ఇచ్చారు. నందినగర్‌లోని కేటీఆర్ నివాసం లో సాయంత్రం 4 గంటలకు సిట్ అధికా రులు వెళ్లి నోటీసులు అందజేశారు. ఈ నోటీసును బీఆర్ఎస్ లీగల్ సెల్ ఇంచార్జ్ సోమ భరత్ అందుకున్నారు. రెండ్రోజుల క్రితమే బీఆర్ఎస్ కీలక నాయకుల్లో ఒకరైన హరీశ్‌రావును ఇదే కేసులో సిట్ అధికారులు ఏడు గంటల పాటు విచారించిన విషయం తెలిసిందే. తాజాగా కేటీఆర్‌ను పిలవడంతో ఈ కేసు లో ఎలాంటి పరిణామాలు చోటు చేసుకుం టాయోనన్న ఉత్కంఠ సర్వత్రా నెలకొంది. ఫోన్‌ట్యాపింగ్ వ్యవహారం సాగిన కాలంలో బీఆర్ఎస్ ప్రభుత్వంలో కేటీఆర్ మునిసిపల్, ఐటీ వ్యవహారాల శాఖ మంత్రిగా ఉన్నారు.

# ఖరీఫ్‌లో రికార్డు సృష్టించిన తెలంగాణ

- మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**




ఖరీఫ్ సీజన్‌లో తెలంగాణ రాష్ట్రం చరిత్రాత్మక ఘనత సాధించిందని నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. దేశ స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి 75 ఏళ్లలో ఏ భారతీయ రాష్ట్రం సాధించని విధంగా అత్యధికంగా ధాన్యం కొనుగోలు చేసిన ఘనత తెలంగాణకు దక్కిందని పేర్కొన్నారు.ఖరీఫ్ సీజన్‌లో రాష్ట్ర ప్రభుత్వం మొత్తం 71.64 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం కొనుగోలు చేయగా, దాని విలువ సుమారు రూ.19 వేల కోట్లకు పైగా ఉంటుందని మంత్రి తెలిపారు. ఈ కొనుగోళ్ల ద్వారా 15 లక్షల మందికి పైగా రైతులు నేరుగా లబ్ధి పొందారని వెల్లడించారు.గురువారం హైదరాబాద్‌లో పౌర సరఫరాల శాఖ అధికారులతో నిర్వహించిన సమావేశంలో రబీ ధాన్యం కొనుగోళ్ల కార్యాచరణ ప్రణాళికను ఖరారు చేశారు. ఈ సందర్భంగా 'పౌర సరఫరాల కేసుల్లో చట్టపరమైన అమలు మార్గదర్శకాలు' అనే పుస్తకాన్ని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆవిష్కరించారు.

**మౌలిక సదుపాయాలు, ఎగుమతులపై దృష్టి**

ధాన్యం కొనుగోళ్లలో సాధించిన విజయాన్ని కొనసాగించేందుకు గోదాములు, మిల్లింగ్ సామర్థ్యం, రవాణా వ్యవస్థను మరింత బలోపేతం చేస్తామని మంత్రి తెలిపారు. వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులను ప్రోత్సహించడంతో పాటు రైతు సంక్షేమ పథకాలను విస్తరించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని చెప్పారు. పారదర్శకత, బాధ్యతతో పాటు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి కొనుగోళ్ల ప్రక్రియను మరింత సమర్థవంతం చేస్తామని స్పష్టం చేశారు.ఈ సమావేశంలో పేదపల్లి జిల్లా పౌర సరఫరాల అధికారి శ్రీనాథ్?కు ఉత్తమ సిఎంఆర్ (కస్టమ్డ్ మిల్డ్ రైస్) డెలివరీలు చేసినందుకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రశంసాపత్రం అందజేశారు. అధికారులు ఇదే ఉత్సాహంతో రబీ సీజన్ కొనుగోళ్లను విజయవంతం చేయాలని మంత్రి సూచించారు.

## నైని కోల్ బ్లాక్ టెండర్లపై కేంద్ర విచారణ

- ఇద్దరు సభ్యులతో నిపుణుల బృందం ఏర్పాటు
- మూడ్రోజుల్లో నివేదిక సమర్పించాలని కేంద్రం ఆదేశం
- సింగరేణిలో పర్యటించనున్న కేంద్ర బొగ్గు శాఖ బృందం పర్యటన

వివరాలు 2వ పేజీలో

## మేడారం జాతరకు హెలికాప్టర్ సేవలు ప్రారంభం

- ప్రారంభించిన మంత్రి సీతక్క

వివరాలు 4వ పేజీలో



# గిరిజన జాతర్లకు పెద్ద ఎత్తున నిధులు

- దేవాదాయ ధర్మాదాయ, అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్ర ప్రభుత్వం ఆదివాసీ గిరిజనుల సంస్కృతీ సంప్రదాయాలకు అత్యం త ప్రాధాన్యతనిస్తోందని, గిరిజన జాతర్లకు పెద్దఎత్తున నిధులు కేటాయిస్తున్నట్టు దేవాదాయ ధర్మాదాయ, అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ తెలిపారు. ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలంలోని నాగోబా జాతర సందర్భంగా గురువారం ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అధ్యక్షతన నిర్వహించిన గిరిజన ప్రజా దర్బార్‌లో మంత్రి పాల్గొన్నారు. గిరిజనుల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచే సమ్మక్క-సారలమ్మ, నాగోబా జాతరలు ఘనంగా నిర్వహించేందుకు ప్రభుత్వం ఎన్నడూ లేని విధంగా నిధులు మంజూరు చేస్తోందని మంత్రి తెలిపారు. మేడారం సమ్మక్క-సారలమ్మ జాతరకు రూ.250 కోట్లు కేటాయిం చిందని, త్వరలోనే నాగోబా ఆలయానికి రూ.22కోట్లు కేటాయిస్తుందని చెప్పారు. నాగోబా దర్బార్‌కు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ గిరిజనుల నుంచి స్వీకరించిన అర్జీలను పరిష్కరించేందుకు కృషి చేయాలని అధికారులను ఆదేశిం చారు. గిరిజనుల పోడు భూముల సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తామన్నారు. అటవీ సమస్యలు పరిష్కరించాలంటే దానికి ప్రత్యేక చట్టాలు ఉన్నాయని, ఆ చట్టాల ప్రకారం అటవీ ప్రాంతంలో ఒక్క రాయి కూడా తీయలేమని తెలిపారు. గిరిజనులకు ప్రభుత్వం అండగా ఉంటుందని, సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించి జిల్లా స్థాయిలో పరిష్కారంకాని సమస్యలను రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించాలని సూచిం చారు. అక్కడా కాకపోతే కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి పరిష్కరిస్తామన్నారు. పోడు పట్టాలు పొందిన గిరిజనులకు వారసత్వ పట్టాలు మంజూరు చేస్తున్నామని, అర్హులైన వారికి సైతం పట్టాలు ఇచ్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు.

# పేదల పొట్టకొట్టేలా మోడీ ప్రభుత్వం



- ఉపాధి హామీ చట్టం రద్దు వెనుక కుట్ర
- రైతుల్లాగే కార్మికులు పోరాడాలి
- లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ

**బలగం టీవీ, న్యూఢిల్లీ**


కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం పేదల పొట్టకొట్టేలా వ్యవహరిస్తోందని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్ర విమర్శలు గుప్పించారు. గతంలో రైతులపై ప్రయోగించిన అస్త్రాలనే ఇప్పుడు నిరుపేద కార్మికులపై ప్రయోగిస్తున్నారని ఆరోపించారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేసి, దాని స్థానంలో కొత్త చట్టాన్ని తీసుకురావడం వెనుక పెద్ద కుట్ర దాగి ఉందని పేర్కొన్నారు.గురువారం న్యూఢిల్లీలో జరిగిన 'జాతీయ ఉపాధి హామీ కార్మికుల సదస్సు'లో పాల్గొన్న రాహుల్ గాంధీ, మోడీ సర్కార్ విధానాలను తీవ్రంగా ఎండగట్టారు. గతంలో మూడు నల్ల వ్యవసాయ చట్టాలతో రైతులను ఇబ్బంది పెట్టినట్లే, ఇప్పుడు కొత్త చట్టం ద్వారా కూలీల హక్కులను కాలరాస్తున్నారని మండిపడ్డారు.

**రైతుల్లాగే కార్మికులు పోరాడాలి**

నల్ల వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా రైతులు ఏకమై పోరాడినట్లే కార్మికులు కూడా ఉద్యమించాలని రాహుల్ గాంధీ పిలుపునిచ్చారు. "రైతులు ఐక్యంగా పోరాడటంతో కేంద్ర ప్రభుత్వం చట్టాలను వెనక్కి తీసుకోవాల్సి వచ్చింది. ఇప్పుడు కార్మికుల వంతు వచ్చింది. కార్మికులంతా ఏకమైతేనే ప్రభుత్వం దిగివస్తుంది. కొత్తగా తీసుకువచ్చిన వీబీ--జీ రామ్ జీ చట్టాన్ని రద్దు చేసే వరకు పోరాడాలి" అని ఆయన అన్నారు.దేశ సంపదను కొద్దిమంది కార్పొరేట్లకు దోచిపెడుతున్నారని రాహుల్ తీవ్ర ఆరోపణలు చేశారు. "మోదీ కోరుకుంటున్న 'భారతదేశ మోడల్' అత్యంత ప్రమాదకరం. దేశ ఆస్తులన్నీ కొద్దిమంది చేతుల్లోనే ఉండాలి. పేద ప్రజలంతా అదానీ, అంబానీలపై ఆధారపడి బతకాలి అన్నదే బీజేపీ విధానం. ఒక రాజు అన్ని నిర్ణయాలు తీసుకునే వ్యవస్థను దేశంపై రుద్దుతున్నారు. పేదలకు హక్కులు ఉండకూడదన్నదే వారి లక్ష్యం" అని దుయ్యబట్టారు.

ఉపాధి హామీ పథకం అసలు మిగితా 2వ పేజీలో

# ఏ తప్పూ చేయలేదు.. భయపడేది లేదు



- ఫోన్ ట్యాపింగ్ కేసు బక్వాస్
- జిల్లాల రద్దు కుట్ర
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

తాను ఎలాంటి తప్పు చేయలేదని, ఎవరికీ భయపడాల్సిన అవసరం లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ స్పష్టం చేశారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో సిట్ విచారణకు హాజరుకావాలని నోటీసులు అందడంపై స్పందించిన ఆయన, ఈ కేసును 'బక్వాస్'గా కొట్టిపారేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆయన మంత్రుల ఫోన్లు ట్యాప్ కావడం లేదని ఒక్క అధికారి అయినా బయటకు వచ్చి చెప్పగలడా? అంటూ ప్రశ్నించారు.కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి ఫోన్లు ట్యాప్ అవుతున్నాయని ఒక జర్నలిస్టు కథనం రాసినా ప్రభుత్వం స్పందించలేదని ఆరోపించారు. ఇటీవల మంత్రుల వాటాల పంచాయతీలపై వార్తలు రాస్తే ముగ్గురు జర్నలిస్టులు బలయ్యారని విమర్శించారు. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఫోన్ ట్యాపింగ్ కేసులో అత్యుత్సాహం ప్రదర్శిస్తున్న అధికారులు బాధ్యత వహించక తప్పదని హెచ్చరించారు.

**జిల్లాల రద్దుకు కుట్ర**

జిల్లా పరిషత్ ఎన్నికలు నిర్వహించకుండా తప్పించుకోవాలనే ఉద్దేశంతోనే బీఆర్ఎస్ హయాంలో కేసీఆర్ నాయకత్వంలో ఏర్పాటు చేసిన కొత్త జిల్లాలను రద్దు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కుట్రలు చేస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు. జిల్లాల ఏర్పాటు అశాస్త్రీయమని చెబుతూ రిటైర్డ్ జడ్జీలతో కమిషన్ వేయాలని మిగితా 2వ పేజీలో

## హైదరాబాద్‌లో కుక్కల స్వైరవిహారం

- ఐదేళ్ల బాలుడిపై వీధికుక్క దాడి!
- సూరారం పీఎస్ పరిధిలో ఘటన



**బలగం టీవీ, హైదరాబాద్**

హైదరాబాద్ నగరంలో వీధికుక్కల భయం రోజురోజుకూ పెరుగుతోంది. తాజాగా సూరారం పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక వీధికుక్క ఐదేళ్ల బాలుడిపై దారుణంగా దాడి చేసింది. సూరారం పరిధిలో తన ఇంటి సమీపంలో ఆడుకుంటున్న ఐదేళ్ల బాలుడిపై ఒక వీధికుక్క ఒక్కసారిగా దాడికి దిగింది. ఈ క్రమంలో కుక్క బాలుడి ముఖంపై తీవ్రంగా గాయపరిచింది. బాలుడి అరుపులు విన్న స్థానికులు వెంటనే స్పందించి, గట్టిగా కేకలు వేయడంతో కుక్క అక్కడి నుండి పారిపోయింది. లేదంటే ప్రమాదం మరింత తీవ్రంగా ఉండేదని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు.

ముఖంపై తీవ్ర గాయాలైన చిన్నారిని తల్లిదండ్రులు వెంటనే సమీపంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం బాలుడు చికిత్స పొందుతున్నాడు. కుక్క దాడి చేసిన తీరు చూసి బాలుడి కుటుంబ సభ్యులు షాక్‌కు గురయ్యారు. ఈ ఘటనపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గాజుల రామారం సర్కిల్ అధికారులకు వీధికుక్కల బెడద గురించి గతంలోనే సమాచారం ఇచ్చామని, అయినా వారు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యం వల్లే ఈరోజు ఒక చిన్నారి గాయపడాల్సి వచ్చిందని, ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి వీధికుక్కల బెడద నుండి తమను కాపాడాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

## సింగరేణిపై కొనసాగుతున్న ఆర్థిక విధ్వంసం

(మొదటి పేజీ తరువాయి)

కేసీఆర్ కుటుంబం పూర్తిగా సింగరేణిపై అజమాయిషీ చేసిందని విమర్శించారు. టెండర్ల నుంచి చిన్న కాంట్రాక్టుల వరకు ప్రతి చోటా కేసీఆర్ కుటుంబ ఆదేశాలే అమలయ్యాయని ఆరోపించారు. మైనింగ్ జరిగే ప్రాంతాల్లో పరిసర ప్రాంతాల అభివృద్ధికి డిస్ట్రిక్ట్ మినరల్ ఫండ్ ఉంటుందనీ, సుమారు రూ.1500 కోట్ల నిధులు ఇప్పటికీ సంబంధిత జిల్లాలకు చేరలేదని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత కూడా ఇన్‌చార్జి సీఎండీలతోనే కాలం గడుపుతూ, ఫుల్ టైం సీఎండీలను నియమించలేదని విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో కూడా టెండర్లు పిలిచి, ఆఫర్లు వచ్చిన తర్వాత మధ్యలోనే రద్దు చేసిందని విమర్శించారు. మైనింగ్ చేయలేమంటూ సింగరేణితో బీఆర్ఎస్ సర్కారు లేఖ రాయించిందని గుర్తు చేశారు. టెండర్లలో సాధారణంగా 'సైట్ విజిట్ సర్టిఫికెట్' సెల్ఫ్ డిక్లరేషన్ రూపంలో ఉంటుందనీ, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాజెక్టు అథారిటీ సర్టిఫికెట్ తప్పనిసరి చేసిందని వివరించారు. నైని కోల్ బ్లాక్ విషయంలో 17 కంపెనీలు సైట్ విజిట్ చేశాయనీ, అందులో ఏ కంపెనీకి కూడా సర్టిఫికెట్ ఇవ్వలేదని గుర్తు చేశారు. తప్పుడు విధానాలతో టెండర్లలో 'సైట్ విజిట్ సర్టిఫికెట్' నిబంధన పెట్టారని ఆరోపించారు. నైనిపై సీబీఐ దర్యాప్తునకు ఆదేశించాలంటే, సీబీఐ రాష్ట్రంలో దర్యాప్తు చేయకూడదని బీఆర్ఎస్ ఉత్తర్వులు తెచ్చి న విషయాన్ని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కోల్ బ్లాక్స్‌కు సంబంధించి వేలాన్ని నిర్వహించకపోతే కేంద్రానికి అప్పగిస్తే పారదర్శకంగా టెండర్ ప్రక్రియ పూర్తి చేస్తామని ఆయన తెలిపారు.

## ఏ తప్పూ చేయలేదు.. భయపడేది లేదు

(మొదటి పేజీ తరువాయి)

ప్రయత్నించడం దురుద్దేశపూరితమని మండిపడ్డారు. రాజన్న సిరిసిల్ల, పెద్దపల్లి, జగిత్యాల జిల్లాలను రద్దు చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం వ్యవహరిస్తోందని తెలిపారు. ప్రజల సౌలభ్యం కోసమే కేసీఆర్ జిల్లాలను ఏర్పాటు చేశారని స్పష్టం చేశారు. బొగ్గు కుంభకోణం విషయంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి వ్యాఖ్యలు హాస్యాస్పదమని కేటీఆర్ విమర్శించారు. "పట్టపగలే దొంగతనం చేసిన వ్యక్తి తాను దొంగనని ఒప్పు కుంటాడా?" అంటూ ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం కోరితేనే సీబీఐ విచారణకు ఆదేశిస్తామనడం సరైనదికాదన్నారు.రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కుమారుడు గుండాలతో కలిసి భూ కబ్జాలు చేస్తున్నా దానిపై సిట్ లేదని, అలాగే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బావమరిది బొగ్గు కుంభకోణాన్ని ఆధారాలతో సహా బయటపెడితేనూ చర్యలు లేవని ఎద్దేవా చేశారు. రేవంత్ రెడ్డి తుగ్లక్ పాలన మానుకోవాలని హితవు పలికారు.

**మున్సిపల్ ఎన్నికలకు సిద్ధం**

రానున్న మున్సిపల్ ఎన్నికలకు బీఆర్ఎస్ పార్టీ పూర్తిగా సిద్ధంగా ఉందని కేటీఆర్ తెలిపారు. ప్రతి మున్సిపాలిటీకి సీనియర్ నాయకులను ఇన్‌చార్జులుగా నియమించనున్నట్లు చెప్పారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఘన విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

## పేదల పొట్టకొట్టేలా మోడీ ప్రభుత్వం

(మొదటి పేజీ తరువాయి)

భావనను మోదీ ప్రభుత్వం నాశనం చేస్తోందని రాహుల్ ఆవేదన వ్యక్తం చేశారు. "యూపీఏ హయాంలో తీసుకొచ్చిన ఉపాధి హామీ చట్టం పేదలకు హక్కును కల్పించింది. పని కావాలనుకునే ప్రతి ఒక్కరికీ ఉపాధి కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే. ఈ పథకం అమలు పంచాయతీ రాజ్ వ్యవస్థ చేతిలో ఉండేది. కానీ ఇప్పుడు కేంద్రం అన్ని అధికారాలను తన చేతుల్లోకి తీసుకుంటోంది. ఎవరికీ పని ఇవ్వాలి? నిధులు ఎవరికీ కేటాయించాలి? అన్నది కేంద్రమే నిర్ణయిస్తుంది. బీజేపీ పాలిత రాష్ట్రాలకే ప్రాధాన్యం ఇచ్చి, కార్మికుల డబ్బును కాంట్రాక్టర్లు, అధికారులకు మళ్లించే ప్రమాదం ఉంది" అని ఆరోపించారు.

**కొత్త చట్టం పేరుపై సెటైర్లు**

కేంద్రం తీసుకొచ్చిన 'వికసిత్ భారత్ -- గ్యారెంటీ ఫర్ రోజ్గార్ అజీవికా మిషన్' పేరుపై రాహుల్ గాంధీ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. "ఆ చట్టం పేరు కూడా నాకు గుర్తుండటం లేదు. అంత క్లిష్టమైన పేర్లు పెట్టి అసలు పథకాన్నే నీరుగారుస్తున్నారు" అని ఎద్దేవా చేశారు.

**గాంధీ పేరును ప్రజల జ్ఞాపకాల నుంచి చెరిపేయడమే: ఖర్గే**

ఈ సదస్సులో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కూడా ప్రసంగించారు. ఉపాధి హామీ పథకాన్ని రద్దు చేయడం అంటే మహాత్మా గాంధీ పేరును ప్రజల జ్ఞాపకాల నుంచి చెరిపేయడమేనని అన్నారు. గ్రామ స్వరాజ్ భావనను దెబ్బతీయడమే బీజేపీ లక్ష్యమని విమర్శించారు. కొత్త చట్టాన్ని అమలు చేయకుండా అడ్డుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని పేర్కొంటూ, రాబోయే పార్లమెంటు బడ్జెట్ సమావేశాల్లో ఈ అంశాన్ని గట్టిగా లేవనెత్తుతామని స్పష్టం చేశారు.

## హైదరాబాద్‌లో రూ. 5 వేల కోట్లతో భారీ ఏఐ డేటా సెంటర్

- హైదరాబాద్‌ను దేశంలోనే ఏఐ డేటా సెంటర్ హబ్గా తీర్చిదిద్దే దిశగా మరో పెద్ద అడుగు
- యూపీసీ రిన్యూవబుల్స్ -- వోల్ట్ డేటా సెంటర్స్‌తో తెలంగాణ ప్రభుత్వం ఎంఓయూ
- ఫ్యూచర్ సిటీలో 100 మెగా వాట్ల ఏఐ డేటా సెంటర్ ఏర్పాటు
- నిర్మాణ దశలో 3,000 ఉద్యోగాలు, ప్రారంభం తర్వాత 800 ఉద్యోగాలు



**బలగం టీవీ, హైదరాబాద్**

హైదరాబాద్‌ను దేశంలోనే ఏఐ డేటా సెంటర్ హబ్‌గా తీర్చిదిద్దాలన్న లక్ష్య సాధనలో రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక పెట్టుబడిని సాధించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని 'తెలంగాణ రైజింగ్' ప్రతినిధి బృందం దావోస్?లో యూపీసీ--వోల్ట్ సంయుక్త భాగస్వామ సంస్థతో అవగాహన ఒప్పందం (ఎంఓయూ) చేసుకుంది.

నెదర్లాండ్స్‌కు చెందిన యూపీసీ రిన్యూవబుల్స్ గ్రూప్, వోల్ట్ డేటా సెంటర్స్‌ల సంయుక్త భాగస్వామ్యంలో రాష్ట్ర ప్రభుత్వంతో చేసుకున్న ఒప్పందం ప్రకారం హైదరాబాద్ భారత్ ఫ్యూచర్ సిటీలో 100 మెగావాట్ల సామర్థ్యంతో ఏఐ డేటా సెంటర్? నెలకొల్పుతుంది.

ముఖ్యమంత్రి నేతృత్వంలోని ప్రతినిధి బృందం వోల్ట్ సీఈవో హాన్ డీ గ్రూట్, యూపీసీ రిన్యూవబుల్స్ (ఆసియా పసిఫిక్) సహ వ్యవస్థాపకుడు స్టీవెన్ జ్వాన్, యూపీసీ రిన్యూవబుల్స్ ఇండియా సీఈవో అలోక్ నిగమ్‌లతో సమావేశమైంది. ఈ ప్రాజెక్టుకు వచ్చే ఐదేళ్లలో రూ. 5,000 కోట్ల పెట్టుబడి పెట్టనుంది. ఈ డేటా సెంటర్‌కు అవసరమైన విద్యుత్ సరఫరాకు 100 మెగావాట్ల సామర్థ్యంతో ప్రత్యేక పునరుత్పాదక విద్యుత్ ప్లాంట్ ఏర్పాటు చేయనుంది. ఈ ప్రాజెక్టు నిర్మాణ దశలో దాదాపు 3,000 మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభిస్తాయి. డేటా సెంటర్ ప్రారంభమైన తర్వాత మరో 800 మందికి ఉద్యోగ అవకాశాలు దక్కనున్నాయి.

పెట్టుబడుల సాధనలో మంత్రి శ్రీధర్ బాబు ని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి అభినందిస్తూ, తెలంగాణ రైజింగ్ 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా తెలంగాణను తీర్చిదిద్దడంలో ఆధునిక డిజిటల్ మౌలిక వసతులు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు స్పందిస్తూ, అధునాతన ఏఐ డేటా సెంటర్ల ఏర్పాటుకు అవసరమైన ప్రోత్సాహకాలు, సౌకర్యాలు ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. నెట్ జీరో సిటీ అభివృద్ధే తెలంగాణ విజన్?లో భాగమని అన్నారు. ఈ సమావేశంలో రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తో పాటు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ఓవర్ స్పీడ్ కాదు, జాగ్రత్తతో డ్రైవ్ చెయ్యండి..



**బలగం టీవీ, వేములవాడ**

- హెల్మెట్‌ను ధరించండి.. ప్రాణాలను కాపాడుకోండి.
- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ పెట్టుకోవాలని, హెల్మెట్ ధరించని వారికి పెట్రోల్ బంక్ యజమానులు సామాజిక బాధ్యతగా పెట్రోల్ పోయవద్దని, ప్రతి వాహనదారుడు తమ వాహనాన్ని భద్రంగా.. బాధ్యతతో నడపాలని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమెల్యే ఆది శ్రీనివాస్ పిలుపునిచ్చారు. గురువారం జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల (సడక్ సురక్ష అభియాన్) కార్యక్రమాన్ని వేములవాడ మున్సిపల్ పరిధిలోని తిప్పాపూర్ లో జిల్లా రవాణా శాఖా ఆద్వర్యంలో నిర్వహించగా, ముఖ్య అతిథులుగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బీ గితే హాజరై ప్రారంభించారు. ట్రాఫిక్ సిగ్నల్ రంగులలాగా సిద్ధం చేసిన బెలూన్లను, శాంతి కపోతాలను ఎగురవేసారు. రోడ్డు భద్రతకు సంబంధించిన స్టికర్లను వాహనాలకు అతికించారు.

ఈ సందర్భంగా విప్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణ సాధ్యమని,ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా ట్రాఫిక్ రూల్స్ పాటించాలని సూచించారు. రోడ్డు ప్రమాదంలో ఇంటి పెద్ద దిక్కును కోల్పోతే ఆ కుటుంబం చాలా ఇబ్బంది పడాల్సి వస్తుందని అన్నారు.ప్రతి వాహనదారుడు ఓవర్ స్పీడ్ డ్రైవింగ్ చేయవద్దని,ట్రాక్టర్ డ్రైవర్లు జాగ్రతగా నడపాలని అన్నారు. మహాశివరాత్రి సందర్భంగా వేములవాడ కు వచ్చే రహదారులకు మరమ్మత్తు చేయిస్తున్నామని అన్నారు. శివరాత్రి సందర్భంగా ఆటో డ్రైవర్లు వివిధ ప్రాంతాలు, రాష్ట్రాల నుంచి వచ్చే యాత్రికులు, భక్తులను క్షేమంగా గమ్యం చేర్చాలని సూచించారు.

అనంతరం ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ వాహనాలు అతివేగంగా,మొబైల్ చూస్తూ వాహనాలు నడపవద్దని, స్కూల్ ఆటోల్లో పరిమితికి మించి విద్యార్థులను తీసుకువెళ్ళవద్దని అన్నారు. ఎక్కువగా రోడ్డు ప్రమాదాల్లో ద్విచక్ర వాహనదారులు, ఆటో వారికి ఇబ్బంది అవుతుందని అన్నారు. నో హెల్మెట్.. నో పెట్రోల్ జిల్లాలో పకడ్బందీగా అమలు చేస్తున్నామని, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని పిలుపునిచ్చారు. బ్లాక్ స్పాట్స్ గుర్తించి నివారణకు కృషి చేస్తున్నామని తెలిపారు. రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారిని మొదటి గంటలో దవాఖనకు తరలించిన వారికి రహవీర్ పథకం కింద రూ.25 వేల ఆర్థిక సహాయం అందిస్తామని అన్నారు.

ఎస్పీ మహేష్ బీ గితే మాట్లాడుతూ హై స్పీడ్, డ్రంక్ అండ్ డ్రైవ్ తోనే ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని అన్నారు. పరిమితికి మించి ప్రయాణీకులను వాహనాల్లో తీసుకువెళ్ళవద్దని సూచించారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చే వాహనాల, రోడ్డు ప్రమాదాల సమాచారం ఆటో డ్రైవర్లు ఇవ్వాలని అన్నారు. ఏఎస్పీ రుత్విక్ సాయి, ఆర్డీఓ రాధాభాయి, జిల్లా రవాణా శాఖ అధికారి లక్ష్మణ్, ఎంవీఐ వంశీధర్, ఆర్టీఏ సభ్యుడు సంగీతం శ్రీనాథ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ రాకేశ్, సిరిసిల్ల, వేములవాడ డిపో మేనేజర్లు ప్రకాష్ రావు, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

## నైని కోల్ బ్లాక్ టెండర్లపై కేంద్ర విచారణ

- ఇద్దరు సభ్యులతో నిపుణుల బృందం ఏర్పాటు
- మూడ్రోజుల్లో నివేదిక సమర్పించాలని కేంద్రం ఆదేశం
- సింగరేణిలో పర్యటించనున్న కేంద్ర బొగ్గు శాఖ బృందం పర్యటన

**బలగం టీవీ, హైదరాబాద్**

తెలంగాణలో సంచలనం సృష్టించిన ఒడిశాలోని నైని కోల్ బ్లాక్ టెండర్ల వ్యవహారంపై కేంద్ర ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి ఆదేశాల మేరకు ఇద్దరు సభ్యులతో కూడిన కేంద్ర బొగ్గు శాఖ అధికారుల బృందం సింగరేణిలో పర్యటించనుంది. నైని కోల్ బ్లాక్ టెండర్లకు సంబంధించిన వివాదం, టెండర్ల రద్దుకు గల కారణాలు సహా ఇతర అంశాలపై ఈ బృందం సవివరంగా దర్యాప్తు చేయనుంది. కేంద్ర బొగ్గు శాఖ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ చేతనా శుక్లా, టెక్నికల్ డైరెక్టర్ మారపల్లి వెంకటేశ్వర్లు ఈ విచారణ బృందంలో సభ్యులుగా ఉన్నారు. ఈ బృందానికి కేంద్రం మూడు రోజుల గడువు ఇచ్చింది. సింగరేణిలో పర్యటించి సంబంధిత అధికారులతో సమావేశాలు నిర్వహించిన అనంతరం, టెండర్ రద్దుకు గల కారణాలపై నివేదికను కేంద్రానికి సమర్పించనుంది.

ఒడిశాలోని నైని కోల్ బ్లాక్ టెండర్ల విషయంలో తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తడంతో తెలంగాణ డిప్యూటీ ముఖ్యమంత్రి, గనుల శాఖ మంత్రి భట్టి విక్రమార్క స్పందించి టెండర్లను రద్దు చేసిన విషయం తెలిసిందే. ఇదే క్రమంలో నైని బొగ్గు గని టెండర్ల నోటిఫికేషన్?ను రద్దు చేస్తున్నట్లు సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ అధికారికంగా ప్రకటించింది.అయితే, ముందుగా నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం గురువారం సాయంత్రం 5 గంటల నుంచి బిడ్ల ప్రక్రియ ప్రారంభం కావాల్సి ఉండగా, పాలనాపరమైన కారణాలతో టెండర్లను రద్దు చేస్తున్నట్లు సింగరేణి అధికారులు స్పష్టం చేశారు. ఈ వ్యవహారంపై కేంద్ర స్థాయి విచారణకు ఆదేశాలు రావడంతో రాజకీయ, పారిశ్రామిక వర్గాల్లో ఆసక్తి నెలకొంది.

## రెండు దొంగతనాల కేసుల్లో వ్యక్తికి రెండేండ్ల జైలు శిక్ష.

- **వివరాలు వెల్లడించిన సిరిసిల్ల పట్టణ సిఐ.కృష్ణ**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**



రెండు దొంగతనాల కేసుల్లో నిందుతునికి రెండు సంవత్సరాల జైలు శిక్ష విధిస్తూ సిరిసిల్ల ప్రథమ శ్రేణి న్యాయమూర్తి ప్రవీణ్ బుధవారం తీర్పు వెల్లడించినట్లు సిరిసిల్ల పట్టణ సిఐ కృష్ణ తెలిపారు. కొనరావుపేట మండలం ధర్మారం గ్రామానికి చెందిన కొమ్ము మల్లయ్య అనే వ్యక్తి తేదీ 12.06.2025 రోజున ఉదయం సిరిసిల్లకు వచ్చి తన బండి పాత బస్టాండ్ లో గల ప్రవీణ్ ఎలక్ట్రికల్ షాపు ముందు పెట్టి కరీంనగర్ ఆసుపత్రికి వెళ్లి తిరిగి వచ్చే సరికి తన బండి కనిపించకపోవడంతో సిరిసిల్ల పట్టణ పోలీస్ స్టేషన్ లో పిర్యాదు చేయగా ఎస్ ఐ ఆయన మురళీధర్ గౌడ్ కేసు నమోదు చేయడం జరిగింది. రెడ్డివాడ కి చెందిన గౌరిశెట్టి శ్రీనివాసన్ అనే వ్యక్తి వ్యాపారం చేసుకుంటూ జీవిస్తాడు. తన యొక్క బైక్ తేదీ 12.08.2025 రోజున రాత్రి సమయంలో బయటకు వెళ్లి వచ్చి రెడ్డి వాడలో గల తన ఇంటి ముందు పార్కు చేశాడు. తిరిగి అదే రోజు రాత్రి అందాదా 10 గంటల సమయంలో చూసే సరికి తన యొక్క బండి కనిపించపోగ వెంటనే సిరిసిల్ల పట్టణ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్ ఐ మురళీధర్ గౌడ్ కేసు నమోదు చేసి దర్యాప్తులో భాగంగా రెండు దొంగతనం కేసులలో తంగళ్ళపల్లి కి చెందిన మహమ్మద్ ఇర్ఫాన్ ని నిందుతునిగా గుర్తించి అరెస్టు చేసి రిమాండ్ కు తరలించడం జరిగింది.

ఆనంతరం కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయగా సిఎంఎస్ ఎస? శ్రావణ్ ఆధ్వర్యంలో కోర్టు కానిస్టేబుల్ వేముల నరేష్ రెండు కేసులలో 10 మంది సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టినారు.ప్రాసిక్యూషన్ తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ చెలుమల సందీప్ వాదించగా కేసు పూర్వపరాలు పరిశీలించిన న్యాయమూర్తి ప్రవీణ్ నిందుతుడు అయిన ఇమ్రాన్ కి రెండు కేసులలో రెండు సంవత్సరాల జైలు శిక్షతో పాటు 200 రూపాయల జరిమానా విధించడం జరిగిందని సిరిసిల్ల పట్టణ సిఐ.కృష్ణ తెలిపారు.

## ఎమ్మెల్యే విజయుడిపై ఎంపీ మల్లు రవి దాడి గర్హనీయం

- **మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి**

**బలగం టీవీ, హైదరాబాద్:**



అలంపూర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే విజయుడిపై కాంగ్రెస్ ఎంపీ మల్లు రవి దుర్భాషలాడుతూ, భౌతిక దాడికి దిగడం అత్యంత హేయమైన చర్య అని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్యంలో ప్రజాప్రతినిధులపై ఇలాంటి దాడులు జరగడం శోచనీయమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఎంపీ మల్లు రవి మాదిరిగానే ఎమ్మెల్యే విజయుడు కూడా ప్రజల ఓట్లతోనే గెలిచారని, ఒక ప్రజాప్రతినిధిని అవమానించడం అంటే ప్రజలను అవమానించడమేనని నిరంజన్ రెడ్డి పేర్కొన్నారు. సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న మల్లు రవి, తోటి ప్రజాప్రతినిధిపై దాడి చేయడం ఆయన స్థాయికి తగదని విమర్శించారు. పెద్దరికాన్ని ప్రదర్శించాల్సిన చోట అహంకారాన్ని చూపడం సరికాదన్నారు. కాంగ్రెస్ పాలనలో విలువలు, ప్రజాస్వామిక స్ఫూర్తి పూర్తిగా అడుగంటిపోయాయని ఈ ఘటన నిరూపిస్తోందని దుయ్యబట్టారు. తప్పు చేసి పైగా ఎదుటివారినే క్షమాపణ కోరడం హాస్యాస్పదంగా ఉందని ఆయన మండిపడ్డారు. మల్లు రవి వెంటనే భేషరతుగా ఎమ్మెల్యే విజయుడికి క్షమాపణ చెప్పాలని, తన వ్యవహార శైలిని మార్చుకుని హుందాతనాన్ని కాపాడుకోవాలని హితవు పలికారు. ప్రజాప్రతినిధుల మధ్య భిన్నాభిప్రాయాలు ఉండొచ్చు, కానీ భౌతిక దాడులకు దిగడం అమానుషం. మల్లు రవి తన తప్పును తెలుసుకుని పశ్చాత్తాపం వ్యక్తం చేయాలి.



## గ్రీన్ ఇండియా ఛాలెంజ్ క్యాలెండర్ ఆవిష్కరణ.

**బలగం టీవీ, బోయినిపల్లి:**

మాజీ రాజ్యసభ సభ్యులు గ్రీన్ ఇండియా ఛాలెంజ్ అధినేత జోగినిపల్లి సంతోష్ కుమార్ స్వయంగా తాను కెమెరా లో బంధించిన పక్షుల చిత్రాలను కలిపిన 2026 క్యాలెండర్లను బుధవారం రోజున రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండల కేంద్రంలోని బిఆర?స్ పార్టీ ఆఫీస్ లో ప్రారంభించి, నాయకులతో పాటు కార్యకర్తలు క్యాలెండర్లను బోయినిపల్లి బిఆర?స్ మండల నాయకులు అందించారు. ఈ కార్యక్రమంలో బి.ఆర్.ఎస్ మండల అధ్యక్షులు కత్తెరపాక కొండయ్య, మాజీ వైస్ ఎంపీపీ కొనుకటి నాగయ్య, ప్రధాన కార్యదర్శి గుంటి శంకర్, మాజీ సర్పంచ్ చిందం రమేష్, మండల నాయకులు ముద్దం రవి, కమల్ గౌడ్, భీమనాతుని రమేష్, కన్నం సాగర్, సుద్దాల రవీందర్, గురజాల కోటి, జంగిటి సంజీవ్, తుంటి మధు, చెందు, పర్షరాములు తదితరులు పాల్గొన్నారు.

## దావోస్‌లో రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన నారా లోకేష్.

**బలగం టీవీ, హైదరాబాద్**



తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని ఆంధ్రప్రదేశ్ మానవ వనరుల అభివృద్ధి, ఐటీ, కమ్యూనికేషన్స్ శాఖ మంత్రి నారా లోకేష్ మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రపంచ ఆర్థిక సదస్సులో పాల్గొనడానికి దావోస్‌కు వెళ్లిన ముఖ్యమంత్రి ని అక్కడ లోకేష్ మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.

## పంచాయతీ రాజ్ చట్టానికి అనుగుణంగా పరిపాలించాలి..

- **జిల్లా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్.**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**



సిరిసిల్ల జిల్లాలో నూతనంగా ఎన్నికైన సర్పంచులు తెలంగాణ పంచాయతీరాజ్ చట్టానికి అనుగుణంగా పరిపాలించాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు. తెలంగాణ ప్రభుత్వం తెలంగాణ ఇన్స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవల ప్మెంట్ ఆదేశాల మేరకు జిల్లా యంత్రాంగం ఆద్వర్యంలో ఇల్లంతకుంట, తంగళ్ళపల్లి మండలాల సర్పంచులకు వేములవాడ పట్టణంలోని జవహర్ లాల్ నెహ్రూ బీఈడీ కళాశాలలో ఐదు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తుం డగా, బుధవారం ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరయ్యారు.

ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. నూతనంగా ఎన్నికైన సర్పంచులకు అభినందనలు తెలియజేశారు. పంచాయతీ రాజ్ చట్టం ప్రకారం 1/3 కోరం ఉండేలా చూసుకోవాలని, ప్రతి ఏడాది ఆరు గ్రామసభలు నిర్వహించాలని, గత సమావేశం అంశాలు, తీర్మానాలు చర్చించాలని, ప్రస్తుత సమావేశంలో ప్లానింగ్, అమలుపై చర్చించాలని సూచించారు. మహిళల కోసం, వృద్ధులు, అనాథలు, ప్రకృతి విపత్తులు, అత్యవసర ఆరోగ్య సమావేశాలు నిర్వహించాలని తెలిపారు. నిధుల దుర్వినియోగం కాకుండా చూడాలని, ప్రతి అభివృద్ధి పనినీ గ్రామ పంచాయతీ తీర్మానం మేరకే చేయాలని స్పష్టం చేశారు. అన్ని రిజిస్టర్ల నిర్వహణ సక్రమంగా ఉండాలని సూచించారు.

ప్రతి గ్రామంలో పారిశుధ్య పనులు నిత్యం చేయించాలని, ఇండ్లు, వివిధ ప్రాంతాల్లో నీరు నిలువ ఉండకుండా చూడాలని ఆదేశించారు. ప్రతి గ్రామంలోని డంపింగ్ యార్డు, సెగ్రిగేషన్ షెడ్లు వినియోగంలోకి తీసుకురావాలని, తడి, పొడి చెత్తను వాహనాల్లో సేకరించి, వేరు చేసి డంపింగ్ యార్డుకు తరలించాలని తడి చెత్తను సేంద్రియ ఎరువుగా తయారు చేయాలని సూచించారు. పొడి చెత్తను విక్రయించాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ చెత్తను తగలబెట్టవద్దని స్పష్టం చేశారు. దోమల నివారణపై ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు. ప్రతి వారంలో శుక్రవారం డ్రై డేగా పాటించాలని, ఇండ్లలో మొక్కల కుండీలు, కూలర్లు, వినియోగించిన కొబ్బరి బొండాల్లో నీరు నిలువ ఉండకుండా చూడాలని తెలిపారు. మంచినీటి సరఫరా పై దృష్టి సారించాలని, ప్రతి నెలా 1, 11, 21వ తేదీల్లో ట్యాంక్ ల్లో నీటిని తీసివేసి, బ్లీచింగ్ పౌడర్ తో శుభ్రం చేయించాలని, సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి దగ్గరుండి చూడాలని తెలిపారు. రానున్న వేసవిని దృష్టిలో పెట్టుకొని గ్రామాల్లో ఉన్న నీటి వనరులు చూసుకోవాలని సూచించారు. ప్రస్తుతం నీటి సరఫరా, రానున్న రోజుల్లో నీటి సరఫరా ఏమి కావాలో ముందుగానే అంచనా వేయాలని పేర్కొన్నారు. దానికి అనుగుణంగా ఒక ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని తెలిపారు. గ్రామ బడ్జెట్ లో 10 శాతం మొక్కల పెంపకం, సంరక్షణకు తప్పనిసరిగా వాడాలని స్పష్టం చేశారు. వీధి దీపాల నిర్వహణను చూసుకోవాలని తెలిపారు.

ప్రభుత్వ ఆదాయ వనరుల కేటాయింపుతో పాటుగా స్థానిక ఆదాయ వనరులు చూసుకోవాలని సూచించారు. ఇంటి, ఇతర పన్నులు వసూలు చేయాలని, వివిధ దుకాణాలు కొనసాగించేవారికి లైసెన్సులు జారీ చేయాలని, ప్రతి నూతన గృహ నిర్మాణాలకు పర్మిషన్ ఇవ్వాలని తెలిపారు. వీటి ద్వారా ప్రతి గ్రామ పంచాయతీకి ఆదాయం వస్తుందని వెల్లడించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి షరీఫుద్దిన్, తహసీల్దార్ విజయ ప్రకాశ్ రావు వివిధ మండలాల ఎంపీడీఓలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి వాహనదారుడూ హెల్మెట్ తప్పక ధరించాలి



- **రాజన్న సిరిసిల్ల జిల్లాలో నో హెల్మెట్ - నో పెట్రోల్ పకడ్బందీగా అమలు.**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

రోడ్డు ప్రమాదాల్లో ద్విచక్ర వాహనదారుల ప్రాణ నష్టాన్ని తగ్గించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అరైవ్?? -- అలైవ్? కార్యక్రమంలో భాగంగా జిల్లాలో నో హెల్మెట్ -- నో పెట్రోల్ నిబంధనను అమలు చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే తెలిపారు. ఈనేపథ్యంలో పోలీస్ అధికారులు పెట్రోల్ బంక్ యజమానులు,సిబ్బందితో సమావేశాలు నిర్వహించి, హెల్మెట్ లేకుండా వచ్చిన ద్విచక్ర వాహనదారులకు పెట్రోల్ పోయావద్దని అవగాహన కల్పించి, ప్రతి పెట్రోల్ బంక్ వద్ద నో హెల్మెట్ -- నో పెట్రోల్ ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం జరిగింది.వాహనదారులు చేసే చిన్న చిన్న తప్పిదాల కారణంగా జరిగే రోడ్డు ప్రమాదాల కారణంగా వాహనదారులు భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తోందని,ముఖ్యంగా ప్రతి ద్విచక్ర వాహనదారుడు తన స్వీయ రక్షణతో పాటు తన కుటుంబ క్షేమం కోసం హెల్మెట్ తప్పక ధరించాలని, ప్రతి ఒక్కరు ట్రాఫిక్-రోడ్డు భద్రత నియమాలు పాటిస్తూ ప్రమాదాల నివారకు కృషి చేయాలని జిల్లా ఎస్పీ పిలుపునిచ్చారు.

## సింగరేణి బొగ్గు బ్లాక్‌లలో భారీ కుంభకోణం

- **మాజీ మంత్రికొప్పుల ఈశ్వర్**

**బలగం టీవీ, హైదరాబాద్**



సింగరేణి కోల్ మైన్స్‌లో బొగ్గు బ్లాక్‌ల కేటాయింపుల్లో భారీ కుంభకోణం జరిగిందని, దీనిపై సీబీఐ విచారణకు ఆదేశించాలని మాజీ మంత్రి, టీబీజీకేఎస్ గౌరవ అధ్యక్షుడు కొప్పుల ఈశ్వర్ డిమాండ్ చేశారు. తెలంగాణ భవన్‌లో సోమవారం నిర్వహించిన ప్రెస్ మీట్‌లో ఆయన ఈ మేరకు మాట్లాడారు. సింగరేణి బొగ్గు బ్లాక్‌ల కుంభకోణంపై రాష్ట్రవ్యాప్తంగా చర్చ జరుగుతోందని పేర్కొన్న ఆయన, హరీష్ రావు ఆధారాలతో ఈ అవినీతిని బయటపెట్టిన తర్వాత నైని బొగ్గు బ్లాక్ టెండర్లను ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. అయితే మిగిలిన బ్లాక్?ల టెండర్ల పరిస్థితిపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వలేదని విమర్శించారు.సింగరేణి అనేది ఒక్క బొగ్గు బ్లాక్ మాత్రమే కాదని, లక్షలాది కార్మిక కుటుంబాల భవిష్యత్తుతో ముడిపడి ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రం కుంభకోణాలకు కేరాఫ్ అడ్రస్?గా మారిందని ఆరోపించారు. తాను ఒక సింగరేణి కార్మికుడిగా ఆవేదనతో మాట్లాడుతున్నానని చెప్పారు. బొగ్గు గనుల పని అత్యంత కష్టసాధ్యమైనదని, అలాంటి రంగంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం సుమారు రూ.6 వేల కోట్ల కుంభకోణానికి పాల్పడినట్లు తెలుస్తోందని ఆరోపించారు. ముఖ్యమంత్రి బావమరిది ప్రయోజనాల కోసమే ఈ కుంభకోణం జరిగిందనే ఆరోపణలు ఉన్నాయని అన్నారు.

కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో కార్మికుల సంక్షేమం, సింగరేణి అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారని తెలిపారు. ఈ కుంభకోణాన్ని బయటపెట్టినందుకు హరీష్ రావును ఆరు గంటల పాటు విచారణ పేరిట ఇబ్బంది పెట్టడం దుర్మార్గమని వ్యాఖ్యానించారు. కుంభకోణం జరిగిందా లేదా అనే విషయంపై కాంగ్రెస్ నేతలు స్పష్టమైన వివరణ ఇవ్వడం లేదని, అవినీతి జరిగిందని స్పష్టంగా కనిపిస్తుండటంతోనే వారు మౌనం వహిస్తున్నారని అన్నారు. కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ కూడా స్పందించకపోవడం అనుమానాలకు తావిస్తోందని ప్రశ్నించారు. గతంలో కుంభకోణ ఆరోపణలు వస్తే సుమోటోగా విచారణకు ఆదేశాలు ఇచ్చేవారని, ఇప్పుడు రాష్ట్రంలో కాంగ్రెస్, కేంద్రంలో బీజేపీ ఉండటంతో విచారణ జరగడం లేదని ఆరోపించారు. ముఖ్యమంత్రి బావమరిది ప్రమేయం ఉన్నప్పుడు ముఖ్యమంత్రి స్వయంగా విచారణ కోరుతారా అని ప్రశ్నించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో మైనస్ టెండర్లు జరిగేవని, ప్రస్తుతం ప్లస్ టెండర్లు జరగడం అవినీతికి నిదర్శనమని వ్యాఖ్యానించారు. మంత్రుల మధ్య వాటాల పంపిణీ తేడాల వల్లే ఈ కుంభకోణం బయటకు వచ్చిందని కిషన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలే అవినీతి జరిగినట్లు సూచిస్తున్నాయని అన్నారు. కోల్ ఇండియా బొగ్గు నాణ్యత 86 శాతం కాగా, సింగరేణి బొగ్గు నాణ్యత 56 శాతం మాత్రమేనని తెలిపారు. అయినప్పటికీ ఎన్నేళ్లుగా ఎన్టీపీసీ వంటి సంస్థలు సింగరేణి బొగ్గును కొనుగోలు చేస్తున్నాయని చెప్పారు. సింగరేణిని కేంద్రానికి అప్పగిస్తామనే వ్యాఖ్యలు తెలంగాణ ప్రజల హక్కులను హరించడమేనని అన్నారు.సైట్ విజిట్ సర్టిఫికేషన్ విధానం ముఖ్యమంత్రి బావమరిది ప్రయోజనాల కోసమే తీసుకువచ్చారని ఆరోపించారు. కోల్ ఇండియా, ఎన?ఎండీసీ సంస్థల్లో కూడా ఇలాంటి విధానం లేదని, కాంగ్రెస్ ప్రభుత్వం కాంట్రాక్టర్లకు అనుకూలంగా సిండికేట్ వ్యవస్థను తీసుకువచ్చిందని విమర్శించారు.

# అభివృద్ధి--సంక్షేమానికి పట్టం కట్టాలి..



- రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

**బలగం టీవీ, వేములవాడ**

అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ప్రజలు మద్దతు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పిలుపునిచ్చారు. గురువారం వేములవాడ మున్సిపల్ విలీన గ్రామాలైన శాత్రాజ్‌పల్లి, నాంపల్లి గ్రామాల్లో పలు కుల సంఘాల కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి సంబంధించిన మంజూరు పత్రాలను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ లబ్ధిదారులకు అందజేశారు.

ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రజా సమస్యలు ఎక్కడ ఉంటే అక్కడే నిలబడి పరిష్కారం చూపడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమన్నారు. శత్రాజ్?పల్లిలో సుమారు రూ.1 కోటి 43 లక్షల వ్యయంతో పేదలకు ఉపయోగపడే ఆసుపత్రి నిర్మాణం తుదిదశకు చేరుకుందని, ఈ ఆసుపత్రి ప్రారంభం అనంతరం చుట్టుపక్కల గ్రామాలకు శాత్రాజ్‌పల్లి ఒక వైద్య కేంద్రంగా (హబ్?గా) మారుతుందని, త్వరలోనే ఆసుపత్రిని ప్రారంభిస్తామని అన్నారు. అలాగే శాత్రాజ్?పల్లి ప్రధాన కూడలిలో రూ.15 లక్షలతో నూతన జంక్షన్ సుందరీకరణ పనులు జరుగుతున్నాయని, గ్రామంలో 45 మందికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయగా, వాటి నిర్మాణం శరవేగంగా కొనసాగుతోందన్నారు. అడుగు స్థలం లేని 11 మందికి బస్ డిపో పక్కన ఇళ్ల స్థలాలు మంజూరు చేశామని,ప్రజా ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి 12 వార్డులకు రూ.4 కోట్లకు పైగా నిధులు కేటాయించామని అన్నారు.

గత 50 ఏళ్లుగా వేములవాడ ప్రజలు ఎదురుచూస్తున్న రోడ్డు వెడల్పు పనులు ప్రస్తుతం శరవేగంగా సాగుతున్నాయని అన్నారు.

గత ప్రభుత్వం రాజన్న ఆలయ అభివృద్ధిని కేవలం ప్రచార వీడియోలకే పరిమితం చేసిందని, ప్రజా ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చొరవతో రూ.150 కోట్లతో రాజన్న ఆలయ అభివృద్ధి పనులు చేపట్టామని అన్నారు. పట్టణంలో అడుగు జాగా లేని సుమారు 2,000 మందికి స్థలాలు కేటాయించి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశామని, అలాగే రూ.10 కోట్లతో మురుగు నీరు గుడి చెరువులు, మూలవాగులో కలవకుండా ప్రత్యేక ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నామని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తూ ముందుకు సాగుతోందని అన్నారు.

**ఇందిరమ్మ ఇళ్లు పేదలకు వరం**

ఇందిరమ్మ ఇళ్లు పేద ప్రజలకు గొప్ప వరంలాంటివని ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ పట్టణంలోని 11వ వార్డులో ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశ కార్యక్రమంలో పాల్గొని లబ్ధిదారులకు నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల విజయానికి ప్రజలు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

## సిట్ నోటీసులు ఇస్తే భయపడతామనుకున్నావా : మాజీ మంత్రి హరీశ్‌రావు

**బలగం టీవీ, మెదక్**

వ్వ ఎన్ని నోటీసులు ఇచ్చినా.. ఎన్ని అటెన్షన్ డైవర్షన్లు చేసినా నీ వెంటనే పడ్తం' అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు సీఎం రేవంత్‌రెడ్డిని హెచ్చరించారు. మెదక్ జిల్లా పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు.. హరీశ్ రావు సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రేవంత్ రెడ్డిని ప్రజలు ప్రశ్నిస్తున్నారని డైవర్షన్ పాలిటిక్స్ చేస్తునారని అన్నారు. నిన్న తనకు నోటీసులు ఇచ్చారని, నేడు కేటీఆర్‌కు ఇచ్చారని ఆరోపించారు. కేటీఆర్ ఒకవైపు నుంచి నిలదీస్తుండని, ఇంకోవైపు నుంచి తాను అడుగుతూనే ఉన్నానని, అయినా ఎలాంటి సమాధానాల్లేవని ఆగ్రహం వ్యక్తం చేశారు. బొగ్గు కుంభకోణంలో నీ బావమరిదికే నువ్వు సాయం చేసి.. ఇప్పుడు తాము ప్రశ్నిస్తుంటే సమాధానం చెప్పడం లేదని అన్నారు. మాపై విరుచుపడితే లాభం లేదని, సిట్ నోటీసులు ఇస్తే భయపడతామనుకున్నావా అంటూ సీఎంను ప్రశ్నించారు. ఎన్ని నోటీసులు ఇచ్చినా బిడ్డా నిన్ను ప్రశ్నిస్తూనే ఉంటామని, ఎన్నికల్లో హామీ ఇచ్చిన ఆరు గ్యారంటీలు అమలు చేసేదాకా వెంట పడు తూనే ఉంటామని అన్నారు.

### సిరిసిల్ల ప్రజల ఆశీర్వాదంతో

# మున్సిపల్ ఎన్నికల్లో గులాబీ జెండా ఎగరడం ఖాయం..

- సిరిసిల్ల అభివృద్ధి ప్రజల కళ్లముందే ఉంది.. కాంగ్రెస్ మాటలే మిగిలాయి.
- ప్రతి ఇంటికి బీఆర్ఎస్ అభివృద్ధి.. ప్రతి గడపకు కాంగ్రెస్ బాకీ కార్డు.
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- సిరిసిల్ల మున్సిపల్ వార్డు ఇంచార్జిలతో సమావేశం.



**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

సిరిసిల్ల మున్సిపల్ ఎన్నికల్లో ప్రజల ఆశీర్వాదంతో గులాబీ జెండానే ఎగరబోతుందని మెజారిటీ వార్డులను గెలవడమే లక్ష్యంగా బీఆర్ఎస్ పార్టీ ముందుకు సాగుతుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. తెలంగాణ భవన్, సిరిసిల్లలో మున్సిపల్ ఎన్నికలపై వార్డు ఇంచార్జిలతో నిర్వహించిన సమావేశంలో ఆయన దిశానిర్దేశం చేశారు.సిరిసిల్ల ఒకప్పుడు ఎలా ఉందో, బీఆర్?ఎస్ పాలనలో ఇప్పుడు ఎలా అభివృద్ధి చెందిందో ప్రజలకు స్పష్టంగా వివరించాలని కేటీఆర్ సూచించారు. "మన పని మనమే చెప్పుకోవాలి వేరే ఎవరు చెప్పరు" అని ఆయన స్పష్టం చేశారు. మున్సిపల్ ఎన్నికల తర్వాత ఇక స్థానిక ఎన్నికలు ఉండవని, నేరుగా సాధారణ ఎన్నికలే ఉంటాయని పేర్కొంటూ, సిరిసిల్ల మున్సిపాలిటీ గెలవడమే కాదు -- అన్ని వార్డులను బీఆర్ఎస్ కైవసం చేసుకోవాల్సిందే అని స్పష్టంగా చెప్పారు.

కాంగ్రెస్ ప్రభుత్వం జిల్లాల పునర్విభజన పేరుతో గందరగోళం సృష్టిస్తోందని కేటీఆర్ మండిపడ్డారు. రాజన్న సిరిసిల్ల జిల్లాను ఎత్తివేయాలనే కుట్రలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నారని, ఈ అంశం సిరిసిల్ల ప్రజలు, న్యాయవాదులు, మేధావుల్లో తీవ్ర ఆందోళన కలిగిస్తోందని తెలిపారు. జిల్లాలను ఎత్తివేయడానికి సిద్ధమైన ప్రభుత్వం సెస్?ను కూడా ఎత్తివేయడంలో ఆశ్చర్యం లేదని విమర్శించారు. రేవంత్ రెడ్డి పాలనను తుగ్లక్ తరహా నిర్ణయాల పాలనగా అభివర్ణించారు.

సర్పంచ్ ఎన్నికల ఫలితాలతో కాంగ్రెస్ షాక్‌లో ఉందని, అందుకే కార్పొరేషన్ ఎన్నికలు పెట్టడానికి భయపడుతోందని కేటీఆర్ అన్నారు. రాష్ట్రంలో 40 శాతం పైగా సర్పంచ్ స్థానాలను బీఆర్ఎస్ కైవసం చేసుకుందని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు వేళ్ల మీద లెక్కపెట్టే స్థానాలను కూడా గెలవలేదన్నారు. సిరిసిల్ల పట్టణం గత 35 ఏళ్లుగా కాంగ్రెస్‌కు దూరంగా ఉందని, బీఆర్ఎస్ ఆవిర్భావం తర్వాత మున్సిపాలిటీపై పూర్తి ఆధిపత్యం సాధించామని కేటీఆర్ పేర్కొన్నారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు సింగిల్ డిజిట్ కూడా దాటలేని పరిస్థితిలో ఉన్నాయని అన్నారు. బీఆర్?ఎస్ చేసింది ప్రతి ఇంటికి చెప్పాలి కాంగ్రెస్ బాకీ కార్డు ప్రతి గడపకు తీసుకెళ్లాలి అని కేటీఆర్ పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు ఎంతవరకు అమలయ్యాయో, వృద్ధులు, మహిళలు, రైతులు, నేతన్నలు, రిటైర్డ్ ఉద్యోగులకు ప్రభుత్వం ఎంత బాకీ పెట్టిందో ప్రజలకు వివరించాలని సూచించారు. సంక్రాంతి దాటినా రైతు బంధు రాలేదని, బతుకమ్మ చీరల ఆర్డర్లు ఇవ్వలేదని, రిటైర్డ్ ఉద్యోగులకు పించన్లు కూడా దిక్కు లేని పరిస్థితి ఉందని విమర్శించారు. నేతన్నలకు నిజమైన అండగా నిలిచింది కేవలం బీఆర్?ఎస్ ప్రభుత్వమేనని గుర్తు చేశారు. సిరిసిల్ల మున్సిపల్ ఎన్నికలను నేరుగా తానే పర్యవేక్షిస్తానని ప్రకటించిన కేటీఆర్, ప్రజలు ఎన్నికలు ఎప్పుడు వచ్చినా బీఆర్?ఎస్ వైపే ఉన్నారని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్?కు బీఆర్?ఎస్ ఫీవర్ పట్టుకుందని, సిరిసిల్ల ప్రజలంతా గులాబీ జెండా వైపే ఉన్నారని స్పష్టం చేశారు.

సిరిసిల్ల మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్?ఎస్ గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త, ప్రతి వార్డు ఇంచార్జి ఇంటింటి ప్రచారం చేస్తూ ప్రజల మధ్యకు వెళ్లాలని, అభివృద్ధిని వివరించి కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగట్టాలని కేటీఆర్ పిలుపునిచ్చారు.

# ప్రియుడి కోసం భర్తను చంపిన భార్య

- రాత్రంతా పోర్న్ వీడియోలు చూస్తూ పైశాచికానందం!



**బలగం టీవీ, గుంటూరు:**

ఏపీ గుంటూరు జిల్లా దుగ్గిరాల మండలం చిలువూరు గ్రామంలో సంచలనం సృష్టించిన లోకం శివనగరాజు హత్య కేసు మిస్టరీని పోలీసులు ఛేదించారు. వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడనే నెపంతో భార్యే ప్రియుడితో కలిసి భర్తను అంతమొందించినట్లు విచారణలో తేలింది.

చిలువూరుకు చెందిన శివనగరాజుకు 2007లో లక్ష్మీ మాధురి అనే మహిళతో వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. తన భార్య, ఇద్దరు పిల్లలతో కలిసి జీవనం సాగిస్తున్న శివనగరాజు విజయవాడలోని ఒక సినిమా థియేటర్ టికెట్ కౌంటర్లో పనిచేస్తున్న సమయంలో లక్ష్మీ మాధురికి గోపి అనే వ్యక్తితో పరిచయం ఏర్పడింది. అది కాస్తా వివాహేతర సంబంధానికి దారితీసింది. తన అక్రమ సంబంధానికి భర్త అడ్డు రాకూడదని భావించిన మాధురి, భర్తను హైదరాబాద్?లో గోపి నడుపుతున్న కారు ట్రావెల్స్?లో పనికి పంపింది. అయితే, కొన్నాళ్ల తర్వాత శివనగరాజు తిరిగి గ్రామానికి రావడంతో అతన్ని ఎలాగైనా వదిలించుకోవాలని ఆమె పథకం వేసింది. పథకం ప్రకారం, రాత్రి వండిన బిర్యానీలో భర్తకు తెలియకుండా 20 నిద్రమాత్రలు కలిపింది. భర్త గాఢ నిద్రలోకి వెళ్లిన తర్వాత ప్రియుడు గోపిని ఇంటికి పిలిపించింది. గోపి శివనగరాజు ఛాతిపై కూర్చోగా, లక్ష్మీ మాధురి దిండుతో భర్త మొహంపై అదిమి ఊపిరాడకుండా చేసి చంపేసింది. భర్త చనిపోయిన తర్వాత ప్రియుడు అక్కడి నుండి వెళ్ళిపోగా, ఆ రాత్రంతా లక్ష్మీ మాధురి మృతదేహం పక్కనే కూర్చుని ఫోన్లో పోర్న్ వీడియోలు చూస్తూ గడపడం ఆమె వికృత చేష్టలకు అద్దం పడుతోంది. తెల్లవారుజామున 4 గంటలకు తన భర్తకు గుండెపోటు వచ్చిందని, నిద్రలోనే చనిపోయాడని స్థానికులను నమ్మించే ప్రయత్నం చేసింది. అయితే, మృతదేహం చెవిలో నుండి రక్తం రావడం, ముఖంపై గాయాలు ఉండటాన్ని గమనించిన మృతుడి స్నేహితులు అనుమానం వ్యక్తం చేశారు. శివనగరాజు తండ్రితో కలిసి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పోలీసుల విచారణలో విస్తుపోయే నిజాలు బయటపడ్డాయి. పోస్టుమార్టం నివేదికలో ఛాతి ఎముకలు విరగడం, ఊపిరాడకపోవడం వల్లే మరణం సంభవించిందని తేలింది. పోలీసులు లక్ష్మీ మాధురిని అదుపులోకి తీసుకుని గట్టిగా విచారించగా, ప్రియుడితో కలిసి తానే హత్య చేసినట్లు ఆమె ఒప్పుకుంది. పోలీసులు కేసు నమోదు చేసి నిందితులను రిమాండ్?కు తరలించారు.

# భార్యపై అనుమానంతో గొంతు కోసి చంపిన భర్త!

- అనంతపురం జిల్లాలో ఘోరం:



**బలగం టీవీ, అనంతపురం**

అనంతపురం జిల్లాలో అనుమానం పెనుభూతమై ఓ నిండు ప్రాణాన్ని బలిగొంది. తనతో పదేళ్లుగా కలిసి ఉన్న భార్యను, కన్నబిడ్డల ముందే అత్యంత కిరాతకంగా చంపేశాడో భర్త. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది.

వివరాల్లోకి వెళ్తే.. అనంతపురం నగరంలోని బిందెల కాలనీకి చెందిన వీరాంజనేయులు, లక్ష్మీగంగ (27) పదేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. వీరికి ఇద్దరు పిల్లలు కూడా ఉన్నారు. పదేళ్లుగా అన్యోన్యంగా సాగిన వీరి కాపురంలో ఈ మధ్య కాలంలో 'అనుమానం' చిచ్చు పెట్టింది. భార్య ప్రవర్తనపై అనుమానం పెంచుకున్న వీరాంజనేయులు, తరచూ ఆమెతో గొడవ పడేవాడు. మంగళవారం రాత్రి కూడా దంపతుల మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. ఆ కోపాన్ని మనసులో పెట్టుకున్న వీరాంజనేయులు, బుధవారం తెల్లవారుజామున అందరూ నిద్రలో ఉన్న సమయంలో ఘాతుకానికి ఒడిగట్టాడు. గాఢ నిద్రలో ఉన్న లక్ష్మీగంగను కత్తితో గొంతు కోసి అత్యంత దారుణంగా హత్య చేశాడు. అనంతరం భయాందోళనకు గురికాకుండా, తన ఇద్దరు పిల్లలను తీసుకుని వీరాంజనేయులు నేరుగా పోలీస్ స్టేషన్?కు వెళ్లి లొంగిపోయాడు. తన భార్యను తానే చంపినట్లు పోలీసుల ఎదుట ఒప్పుకున్నాడు. వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. నిందితుడు వీరాంజనేయులపై కేసు నమోదు చేశారు.

# మేడారం జాతరకు హెలికాప్టర్ సేవలు ప్రారంభం

- ప్రారంభించిన మంత్రి సీతక్క




**బలగం టీవీ, హైదరాబాద్**

మేడారంలోని సమ్మక్క సారలమ్మను దర్శనం చేసుకోవడానికి వచ్చే భక్తులు హెలికాప్టర్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని పంచాయతీ రాజ్, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ దనసరి సీతక్క అన్నారు. గతంలో కాలినడక నుంచి ఎడ్ల బండ్లు, కార్ల మీద వచ్చిన భక్తులు నేడు హెలికాప్టర్‌పై రావడానికి సిద్ధమవుతున్నారని అన్నారు. గురువారం ములుగు జిల్లా కేంద్రానికి సమీపంలోని డిగ్రీ కళాశాల ఆవరణలో తంబి సంస్థ ఏర్పాటుచేసిన హెలికాప్టర్ సేవలను మంత్రి సీతక్క ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. అమ్మవార్లను సత్వరమే దర్శనం చేసుకోవడానికి సమయం వధా కాకుండా హెలికాప్టర్ సేవలను రాష్ట్ర పర్యాటక శాఖ చేపట్టిందని అన్నారు. హనుమకొండ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల నుంచి మేడారం వరకు ఒక్కొక్కరికి రూ.35,999, మేడారం పరిసర ప్రాంతాల్లో పర్యటించడానికి రూ.4,800 ధర నిర్ణయించినట్టు తెలిపారు. నేటి నుంచి ఈ నెల 31 వరకు వీరి సేవలు కొనసాగుతాయని అన్నారు. కాగా, 10 ఏండ్లుగా తంబి ఏవియేషన్ ప్రయివేట్ లిమిటెడ్ సంస్థ ఈ సర్వీస్ నిర్వహిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంపత్ రావు, జిల్లా గ్రంధాలయ చైర్మన్ భారత్ రవిచందర్, ములుగు మార్కెట్ కమిటీ చైర్మెన్ రేగ కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.